సాక్షి తిరుపతి
శుక్రవారం । 15 । నవంబర్ । 2024



స్క్రీనింగ్ పరీక్షలతో వ్యాధుల గుర్తింపు
ఎన్‌సీడీసీడీ–3.0 స్క్రీనింగ్ పరీక్షలతో అన్ని రకాల వ్యాధులు గుర్తించొచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. - 8లో



గృహప్రవేశానికి వెళ్తూ..
గృహ ప్రవేశానికి వెళ్తున్న కుటుంబసభ్యులకు మృత్యువు ఎదురైంది. కారును ఢీకొట్టడంతో తల్లీకూతురు మృతిచెందారు. - 8లో



అంకురార్పణ
పెంచలకోనలో శుక్రవారం జరగనున్న ఏకోత్తర సహస్ర కలశాభిషేకానికి గురువారం అంకురార్పణ చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

అవగాహన లేకపోవడంతోనే..



జిల్లా మత్స్యశాఖ జేడీ నాగరాజ

సాక్షి ఎఫెక్ట్..

వాకాడు: ఆక్వా సాగు పట్ల మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నా ఎక్కడో సంబంధం లేని, అవగాహన లేని టెక్నీషియన్ల సలహాలతో అవసరం లేని మందులను రొయ్యల చెరువుల్లో వెదజల్లడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జిల్లా మత్స్యశాఖ జేడీ నాగరాజ తెలిపారు. బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'ఆపదొచ్చింది రొయ్యో' కథనంపై ఆయన స్పందించారు. జిల్లాలో ఎక్కడైతే ఆక్వా సాగు జరుగుతుందో ఆయా ప్రాంతాల్లో మత్స్యశాఖ ఏడీలు, ఎఫ్‌డీఓలు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, వారి సూచనలు, సలహాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. సొంతంగా మందులు కొనుగోలు చేసినట్టయితే ఆయా మందుల డబ్బాలపై కోస్టల్ ఆక్వా అథారిటీ (సీఏఏ) ముద్ర ఉంటేనే కొనుగోలు చేయాలని చెప్పారు. ఏవైనా అవసరముంటే తన మొబైల్ నం.9441646148కి ఫోన్ చేసినా తగు సూచనలు, సలహాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

ధర్నా వైపు ఆర్టీసీ అడుగులు

ఈ నెల 19, 20 తేదీల్లో టీ విరామంలో ధర్నా

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తయినా ఆర్టీసీ సమస్యలు ఒక్కటీ పట్టించుకోకపోవడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యోగులు ఈ నెల 19, 20 తేదీల్లో ఎర్ర బ్యాడ్జీలతో విధులు నిర్వహించడంతోపాటు ఉదయం 11 గంటల టీ విరామ సమయంలో ధర్నా చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు ఉద్యోగ సంఘం అధ్యక్షుడు దళవాయి గురునాథం, కార్యదర్శి తండాయం సత్యనారాయణ గురువారం ఉద్యోగులకు సమాచారం జారీచేశారు. 19, 20 తేదీల్లో తిరుపతి జిల్లాలోని 11 డిపోలకు చెందిన ఉద్యోగులు ఆయా డిపోల పరిధిలో ధర్నా చేపట్టాలని చెప్పారు. కొత్త సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని, ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, జాప్యం లేకుండా పదోన్నతులు కల్పించాలని, పెంచిన పేస్కేల్ ప్రకారం అరియర్స్ చెల్లించాలని, డీఏల పంపిణీలో జాప్యం లేకుండా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆర్ట్స్ రీజినల్ సెంటర్ ఏర్పాటుపై ఎంఓయూ



ఒప్పంద పత్రాలతో వర్సిటీ వీసీ, ఐజీఎన్‌సీఏ డైరెక్టర్

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ, ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) సంస్థల మధ్య రీజినల్ సెంటర్ ఏర్పాటు కోసం పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీలో గురువారం ఈ మేరకు ఇరువురు అధికారులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సంస్కృత వర్సిటీలో భారతీయ కళా సంస్కృతి, వైశిష్ట్యం, ప్రత్యేకించి సాహిత్యం, సంగీతం, నాటకం, శిల్పకళలు, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, ఎంబ్రాయిడింగ్ వంటి విషయాలపై భారతావని అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ ఐజీఎన్‌సీఏతో ఒప్పందం జరగడం శుభపరిణామన్నారు. ఐజీఎన్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ ప్రియాంక మిశ్రా, వర్సిటీ రిజిస్ట్రార్ రమశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

18న ఉద్యోగమేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 18వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్, డీఆర్‌డీఏ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాకు పలు బహుళజాతి కంపెనీలు హాజరవుతాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ, యువకులు తమ వెంట ఆధార్‌కార్డు, విద్యార్హత జిరాక్స్ కాపీలు, బయోడేటా ఫాంతో రావాలని సూచించారు. సంబంధిత వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7989509540, 8919889609 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వచ్చే నెల 4 నుంచి డిగ్రీ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 4 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ తెలిపారు. ఈ మేరకు టైమ్ టేబుల్‌ను పంపించినట్లు ఆయన పేర్కొన్నారు.

అంతా మా ఇష్టం



వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం వద్ద గ్యాస్ పైపులైను కోసం తవ్వి వదిలేసిన కాలువలో నిలిచిపోయిన వర్షపునీరు

ఏడాది కిందట గత ప్రభుత్వంలో రూ.10 కోట్లతో శ్రీకాళహస్తి– తడ ఆర్‌అండ్‌బీ రోడ్డును అద్దంలా తయారు చేశారు. కానీ శ్రీసిటీ సెజ్ పరిశ్రమలోని అవసరాల కోసం తిరువళ్లూరు నుంచి రేణిగుంట మీదుగా శ్రీకాళహస్తి వయా వరదయ్యపాళెం వైపు ఏర్పాటు చేస్తున్న గ్యాస్ పైపులైన్‌తో రోడ్డును అడ్డదిడ్డంగా తవ్వేశారు. మట్టి కుప్పలు సైతం ఎక్కడ పడితే అక్కడ పోసేసి గాలికొదిలేశారు. మరో వైపు వాటర్ పైపు లైన్ల కోసం తవ్వేయడంతో రోడ్డు మొత్తం ధ్వంసమైంది. వాహనదారులు నరకయాతన పడుతున్నారు.

- ఓ వైపు గ్యాస్ లైను.. మరోవైపు వాటర్ లైను
- ఛిద్రమవుతున్న రోడ్లు
- కనీస భద్రతా చర్యలు చేపట్టని వైనం
- రూపురేఖలు కోల్పోతున్న తడ–శ్రీకాళహస్తి రోడ్డు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

వరదయ్యపాళెం : అటు గ్యాస్ పైపులైను.. ఇటు వాటర్ పైపులైన్ల పుణ్యమా అంటూ శ్రీకాళహస్తి–తడ ఆర్‌అండ్‌బీ రోడ్డును ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. తవ్విన మట్టిని రోడ్డుకు అడ్డదిడ్డంగా వేస్తున్నారు. రోడ్డు ధ్వంసమవుతున్నా కనీసం పనులు సాగుతున్నట్లు ఎక్కడా హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదు. గత ప్రభుత్వంలో ఏడాది కిందట రూ.10 కోట్ల వ్యయంతో రెన్యూవల్ చేసి రాకపోకలకు అద్దంలా సిద్ధం చేసిన రోడ్డు మార్గం నేడు పైపులైన్ల కోసం చేపడుతున్న తవ్వకాలతో ఛిద్రమైపోయింది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతూ వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. ఇంతజరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

శ్రీసిటీ సెజ్ పరిశ్రమలోని అవసరాల కోసం తిరువళ్లూరు నుంచి రేణిగుంట మీదుగా శ్రీకాళహస్తి–వరదయ్యపాళెం వైపుగా శ్రీసిటీ సెజ్‌కు గ్యాస్ పైపులైను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కండలేరు నుంచి పరిశ్రమల అవసరాల కోసం శ్రీసిటీ సెజ్‌కు వాటర్ పైపులైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పైపులైను శ్రీకాళహస్తి మీదుగా వరదయ్యపాళెం నుంచి శ్రీసిటీ వరకు వెళ్తుంది. రెండు పైపులైన్లు శ్రీకాళహస్తి–తడ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రెండు వైపులా ఏర్పాటవుతున్నాయి. ఈ పనులను చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ నాలుగు నెలల నుంచి రోడ్డుకిరువైపులా పనులు చేపడుతున్నారు. అయితే రోడ్డుకు ఆనుకుని పైపులైన్ల కోసం గోతులు తీయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు ప్రాజెక్టులు కూడా కేంద్ర ప్రభుత్వానికి అనుబంధమైనవి కావడంతో పనులు వేగంగా సాగుతున్నాయి.



శ్రీకాళహస్తి–తడ మార్గంలో కారణిమిట్ట వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టి కుప్పలు



సత్యవేడు మార్గంలోని వెంకటరెడ్డికండ్రిగ వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టి కుప్ప

పైపులైన్లు ధ్వంసం

పైపులైన్ల ఏర్పాటుతో కొన్ని గ్రామాల వద్ద పంచాయతీ ప్రజలకు సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్లు ధ్వంసమవుతున్నాయి. అంతేగాక కొన్ని గ్రామాలకు రాకపోకలు స్తంభిస్తున్నాయి. ధ్వంసమైన పైపులైన్లకు మరమ్మతులు చేయమని స్థానిక పంచాయతీ పాలకులు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో ఒకేచోట 20 సార్లు నీటి సరఫరా పైపులైన్లు ధ్వంసం చేయడంతో బాగుచేయలేక పంచాయతీ సిబ్బంది అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. నేటికీ వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం వద్ద సుమారు 100 మీటర్ల దూరం వరకు పైపులైను కోసం తవ్విన కాలువను పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో వర్షపునీరు ఆ కాలువలో నిండి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఈ కాలువ ఉండడంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అంతేగాక సత్యవేడు మార్గంలోని వెంకటరెడ్డికండ్రిగ, చెరివి రోడ్డు, శ్రీకాళహస్తి మార్గంలోని కారణిమిట్ట, నెలవాయి, బీఎన్‌కండ్రిగ, కుక్కంబాకం ఇలా పలుచోట్ల ప్రమాదకరంగా మట్టి కుప్పలు, గోతులు ఉన్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

ముందుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించేందుకు గానీ, ఎదురుగా వస్తున్న వాహనానికి వైదొలగేందుకు ఏ మాత్రం తారురోడ్డు దిగితే కాలువలో కూరుకుపోవడం ఖాయం. ప్రధాన రోడ్డుకు ఆనుకుని రోడ్డుకు రెండు వైపులా కాలువల కోసం తవ్వకాలు చేపట్టడం పెను ప్రమాదానికి దారి తీస్తుందని స్థానికులు చెబుతున్నారు. కనీసం రోడ్డుకు 5 మీటర్ల నిడివి ఉంచి పైపు లైన్లు ఏర్పాటు చేసుకుంటే బాగుండేదని సూచిస్తున్నారు.

భద్రతా చర్యలు శూన్యం

రోడ్డుకిరువైపులా అటు గ్యాస్ పైపులైను కోసం ఇటు వాటర్ పైపు లైన్ కోసం పెద్దఎత్తున తవ్వకాలు జరుగుతున్నాయి. భూమి నుంచి లోపలికి 7 అడుగుల లోతు వరకు తవ్వకాలు చేస్తున్నా ఎక్కడా భద్రతాపరమైన చర్యలు తీసుకోవడం లేదు. పైపులైను కోసం గోతులు తీయడం, తీసిన మట్టి కుప్పలను రోడ్డుకు అడ్డంగా వేయడంతో రాత్రివేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేగాక కొన్నిచోట్ల రోజుల తరబడి గుంతలను అలానే ఉంచడంతో గ్రామాల వద్ద అటు వైపుగా వెళ్తున్న పశువులు ప్రమాదాలకు గురవుతున్నాయి. భారీ వాహనాలు సైతం గోతులలో ఒరిగిపోతున్నాయి. అయితే ఇంత జరుగుతున్నా కాంట్రాక్టర్ మాత్రం తమకు అడ్డొచ్చేదెవరనే కోణంలో అడ్డదిడ్డంగా పనులు చేపడుతున్నారు.

రూపురేఖలు కోల్పోతున్న రోడ్డు

శ్రీకాళహస్తి–తడ మార్గంలోని కదూరు కూడలి వరకు, సత్యవేడు–తడ రోడ్డు మార్గంలోని చిన్న పాండూరు వరకు 45 కి.మీల మేరకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. ఈ మార్గాలలో ఎక్కడపడితే అక్కడ పైపులైన్ల కోసం చేపట్టిన తవ్వకాలు అక్కడక్కడా వదిలి వేయడం, అంతేగాక తవ్వకాల ద్వారా తోడిన మట్టిని రోడ్డు కడ్డంగా వేసి వదిలేయడంతో ఆ మార్గం రూపురేఖలు కోల్పోతోంది. ఇది రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన రోడ్డా? లేక గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోడ్డా? అనే కోణంలో అనుమానాలు రేకెత్తిస్తోంది. ఏడాది క్రితం అద్దంలా అభివృద్ధి జరిగిన రోడ్డు మార్గం నేడు దుస్థితికి చేరుకోవడం పట్ల ఆ మార్గాల్లోని స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సత్యవేడు–కదూరు కూడలి మార్గంలో భద్రతా ప్రమాణాలు లేకుండా ఉన్న పైపులు



శ్రీకాళహస్తి–తడ మార్గంలో నెలవాయి వద్ద అరకొరగా పూడ్చి వదిలేసిన పైపులైను కాలువ

భద్రతా ప్రమాణాలు పాటించలేదు



శ్రీకాళహస్తి–తడ ప్రధాన రోడ్డు మార్గంలో పైపులైన్ల కోసం చేపడుతున్న పనుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీనివల్ల రాత్రివేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు ఇంత నిర్లక్ష్యంగా చేపట్టడం సరికాదు.
–గురవయ్య, వాహనదారుడు, వరదయ్యపాళెం మండలం

ప్రమాదాలు తప్పవు



శ్రీకాళహస్తి–తడ ప్రధాన రోడ్డుకు ఆనుకుని పైపులైన్ల కోసం చేపడుతున్న కాలువలు వాహనదారులకు రానున్న రోజుల్లో ఇబ్బందికరంగా మారడం ఖాయం. కనీసం భద్రతా ప్రమాణాలు పాటించకుండా రోడ్డుకు ఆనుకుని పైపులైను వేయడం సరికాదు.
–వినోద్ కుమార్‌యాదవ్, వరదయ్యపాళెం

పర్యవేక్షిస్తున్నాం



తడ–శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డు మార్గంలో రెండు పైపులైన్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల పనులు ఆలస్యం కావడంతో ఇటు వర్షాలకు, అటు గోతులలోకి నీరు రావడం, తవ్విన మట్టి రోడ్డుపై వేయడంతో రోడ్డు మరమ్మతులకు గురికావడం వాస్తవమే. మా సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారు. –రాంబాబు, డీఈ, శ్రీకాళహస్తి ఆర్ అండ్ బీ సబ్ డివిజన్

సత్యవేడు గురుకులం
జ్వరం.. కలకలం

- 56 మంది విద్యార్థులకు తీవ్ర జ్వరం
- పరామర్శించిన కలెక్టర్
- ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



సత్యవేడు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సత్యవేడు: సత్యవేడు ఎంజేపీఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు 56 మంది తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. వెంటనే వీరిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్ విద్యార్థులను పరామర్శించారు. జ్వరాలపై ఆరా తీశారు. జ్వరపీడితులులను డాక్టర్‌గా కలెక్టర్ పరీక్షించారు. చేతులు, కండ్లు, గొంతు పరీక్షించారు. జ్వరం ఎప్పటి నుంచి ఉంది.. హాస్టల్‌లో ఎంతమందికి జ్వరం వచ్చింది, అందరికీ ఒకేసారి వచ్చిందా..? మధ్యాహ్న భోజనం చేశారా, అన్నం తినగలుగుతున్నారా..? అని విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులకు వైద్యశాలలో ఏఏ పరీక్షలు నిర్వహించారని సీహెచ్‌సీ డాక్టర్ సురేష్‌ను ప్రశ్నించారు. పిల్లలకు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, కామెర్లు, సీఆర్‌పీ, సీబీసీ పరీక్షలు నిర్వహించినట్టు ఆయన వెల్లడించారు. కుప్పం మండలానికి చెందిన జీ.శివశంకర్ (6వ తరగతి)కి తీవ్ర జ్వరం ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశామని డాక్టర్ తెలిపారు.

డీఎంహెచ్‌ఓ తనిఖీ

సత్యవేడు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థులను డీఎంహెచ్‌ఓ శ్రీహరి పరామర్శించారు. అనంతరం పాఠశాలలోని మరుగుదొడ్లు, స్నానపు గదులు, నీటి వసతులను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, స్నానపు గదులకు తలుపులు లేవు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో కలెక్టర్‌కు సమాచారం అందించారు.

వైద్యశిబిరం



విద్యార్థులను పరీక్షిస్తున్న దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్

డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్ తన సిబ్బందితో రెండు రోజుల పాటు గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులను పరీక్షించి మందులు, మాత్రలు అందించారు. అలాగే ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ మునిరవికుమార్ దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు.

హాస్టల్‌లో వసతులపై సీరియస్

గురుకుల పాఠశాల హాస్టల్‌లో స్నానపు గదులు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. మరుదొడ్ల శుభ్రత సక్రమంగా లేవని మండిపడ్డారు. వార్డన్, నర్సు భువనేశ్వరి, ప్రిన్సిపల్ శ్రీనివాసులును పిలిచి మందలించారు. మరో పర్యాయం ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వైద్యశాలలో గైనకాలజిస్టు, అనస్తీషియా పోస్టులు భర్తీ చేయాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నియోజవర్గ కేంద్రంలో 108 వాహనం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ వైద్యశాలకు రెండు వారాల్లో రెండు పోస్టులు భర్తీ చేసేందుకు చొరవ చూపుతామన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యశాలల సమన్వయాధికారి ఆనందమూర్తి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, తహసీల్దారు సుబ్రమణ్యం, ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్, ఎంఈఓ కే.రవి, దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్లు, సత్యవేడు సీహెచ్‌సీ డాక్టర్లు ఉన్నారు.

ఉల్లిక్కి పడాల్సిందే!



ఉల్లి ధర ఆకాశాన్నంటుతోంది. దిగుబడి తగ్గిపోవడం.. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతో వినియోగదారులకు నరకం కనిపిస్తోంది. ఒక్కసారిగా ధర పెరిగిపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వ పెద్దలు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.


- వంటింట్లో కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి
- ధరతో ప్రజలకు గుండె దడ
- కిలో కనిష్టం రూ.50, గరిష్టం రూ.70

తిరుపతి అర్బన్: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ వైపు పప్పుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మరోవైపు కూరగాయల ధరలు అధికరేట్లు పలుకుతున్నాయి. చివరకు ఉల్లి కోస్తే కాదు.. కొనాలంటేనే కళ్లు నీళ్లు తిరుగుతున్నాయి. ధరలు అదుపు చేయాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసిందని అంతా మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒకటంటే ఒక్కటి కూడా ఇప్పటివరకు సక్రమంగా అమలు చేయకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– ఎర్రగడ్డలు(ఉల్లిగడ్డలు) మేలు రకం కేజీ రూ.70, తగ్గరకం రూ.60 పలుకుతున్నాయి. మరీ నాసిరకం రూ.50 పలుకుపతోంది. ప్రతి వంటకు ఉల్లిపాయ తప్పనిసరిగా వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో ఉల్లి ధరలు పెరిగిపోవడంతో జనం బెంబేలెత్తుతున్నారు. దీంతో సామాన్యుడికి ధరల బెంగ తప్పడం లేదు. గతంలో ఉల్లిపాయలు కిలో మేలు రకం రూ.25, తగ్గురకం రూ.20 ఉండేవి. చౌకదుకాణాల్లో ఉల్లిపాయలను ప్రభుత్వం రాయితీతో అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల టాస్క్‌ఫోర్స్ సభ్యుల నియామకం

- తిరుపతి ఎంపీ గురుమూర్తి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఎంపిక
- సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ప్రత్యేక బృందాలు
- పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలతో ఏర్పాటు





ఎంపీ గురుమూర్తి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ (ప్రత్యేక బృందాలు) నియామకంలో తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులకు గురవుతున్న సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉండేందుకు పార్టీ తరఫున ఈ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయ సహాయం కల్పించడంతో పాటు, వారికి 'మేమున్నాం' అన్న భరోసా ఇవ్వడం, వారిని పరామర్శిస్తూ ఆత్మస్థైర్యాన్ని పెంచడం కోసం పార్టీ కొత్తగా ఏర్పాటైన ప్రత్యేక బృందాలు పనిచేస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలు తెలిపాయి. జిల్లాల వారీగా పార్టీ ముఖ్య నేతలు, లీగల్ సెల్ ప్రతినిధులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పార్టీ ప్రత్యేక బృందాలు పనిచేస్తాయని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 66,441 మంది స్వామివారిని దర్శించుకోగా 20,639 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ. 4.12 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

శాసనమండలి ప్యానల్ వైస్ చైర్మన్‌గా సిపాయి సుబ్రమణ్యం


ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి మంగళం : శాసన మండలి ప్యానల్ వైస్ చైర్మన్‌గా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నియమితులయ్యారు. శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ నుంచి ప్రాతినిధ్యం వహించడానికి ప్యానల్ వైస్ చైర్మన్‌గా నియమితులైనట్లు ఆయన తెలిపారు.

వీడియోగ్రఫీలపై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈ నెల 20వ తేదీ(బుధవారం) నుంచి 30 రోజుల పాటు పురుషులు, మహిళలకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలపై పూర్తిగా ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్‌బాబు గురువారం తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ పురుషులు, మహిళలు అర్హులని పేర్కొన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి బస్సు చార్జీ ఇవ్వడంతో పాటు హాస్టల్ సదుపాయాన్ని కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువ పత్రాలు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న పురుషులకు హాస్టల్ వసతి సైతం అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్. 79896 80587, 94949 51289 సంప్రదించాలన్నారు.

టెండర్లు పిలవకనే పనులా?


చిల్లకూరు మండలం, కడిగేడు రెవెన్యూ గ్రామంలో సర్వేరాళ్లపై ఉన్న పేర్లను తొలగిస్తున్న వైనం

తిరుపతి అర్బన్: భూ సర్వే ప్రక్రియలో భాగంగా గత ప్రభుత్వం సరిహద్దు రాళ్లపై(సర్వే రాళ్లు) ఉన్న పేర్లను తొలగించడానికి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో ఆయన ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన టెండర్లు దక్కించుకున్నవారు సర్వే రాళ్లపై పేర్లు తొలగించాలని స్పష్టం చేశారు. ఒక్కో రాయిపై పేర్లు తొలగించడానికి గరిష్టగా రూ.15 ఇస్తామని ప్రకటించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అసలు టెండర్లు ప్రక్రియ పూర్తి కాకుండానే చిల్లకూరు మండలంలోని కడిగేడు రెవెన్యూ గ్రామంలో సొసైటీ గిడ్డంగి ఆవరణలోని సర్వేరాళ్లపై ఉన్న పేర్లను జోరుగా తొలగిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

మేస్త్రీ మృతి

తిరుపతి రూరల్: బిల్డింగ్ ప్లాస్టింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మేస్త్రి మృతి చెందిన ఘటన గురువారం తిరుపతి రూరల్ లో చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ ఎస్ఐ రామకృష్ణ కథనం.. చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురానికి చెందిన బాబయ్య (37) మేస్త్రి పనులు చేస్తుండేవాడు. గురువారం లింగేశ్వర నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనానికి ప్లాస్టిక్ పనులు చేస్తుండగా మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అతను మృతి చెందాడు.

స్క్రీనింగ్ పరీక్షలతో వ్యాధుల గుర్తింపు

- మత్తేరిమిట్టలో స్క్రీనింగ్ పరీక్షలు
- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్


వరదయ్యపాళెం మండలం, మత్తేరిమిట్టలో ఎన్‌సీడీసీడీ స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వరదయ్యపాళెం: ఎన్‌సీడీసీడీ-3.0 స్క్రీనింగ్ పరీక్షలతో అన్నిరకాల వ్యాధులు నిర్ధారణ చేయొచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం వరదయ్యపాళెం మండలం, మత్తేరిమిట్ట గ్రామంలో ఎన్‌సీడీసీడీ పరీక్షలను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. స్థానికంగా ఉన్న శ్యామలమ్మ ఇంటికి వెళ్లి ఎన్‌సీడీసీడీ స్క్రీనింగ్ పరీక్షలను యాప్ ద్వారా నమోదు చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్‌సీడీసీడీ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ముందస్తుగా క్యాన్సర్ లాంటి వ్యాధులను గుర్తించి తగిన సమయంలో వైద్యం చేసుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ప్రస్తుత మరణాలలో క్యాన్సర్ బారినపడి మృతి చెందేవారు ఐదో వంతు ఉన్నారని, ఆ వ్యాధి నిర్మూలనకు ఎన్‌సీడీసీడీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రొమ్ము, నోటి సర్వైకల్ క్యాన్సర్లను ముందుగా స్క్రీనింగ్ చేసి అరికట్టవచ్చని తెలిపారు. చాలా మంది క్యాన్సర్ కారణ లక్షణాలు ఉన్నప్పటికీ అవగాహన లేక సరైన సమయానికి చికిత్స చేసుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వైద్య సిబ్బంది అందరూ ఇకపై రోజువారీ ఇంటింటికీ వెళ్లి మూడు రకాల క్యాన్సర్లకు సంబంధించి స్క్రీనింగ్‌తో పాటు ఇతర వ్యాధులు గురించి స్క్రీనింగ్ చేస్తారన్నారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి మగ, ఆడవారికి ఓరల్ క్యాన్సర్, 18 పైబడిన ఆడవారికి బ్రెస్ట్ క్యాన్సర్, 30 పైబడిన ఆడవారికి సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలు గల వారిని ముందుగానే గుర్తించి మెడికల్ ఆఫీసర్ దగ్గరికి తీసుకువెళ్లి పరీక్షలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర వ్యాధులకు సంబంధించి స్థానికంగా సీహెచ్‌సీ, ఏరియా హాస్పిటల్‌ల్లో వైద్యం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, అదనపు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీడీ వైద్యురాలు పద్మావతి, స్థానిక చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ అనిత, తహసీల్దార్ రాజశేఖర్, సర్పంచ్ సింధు, సింగిల్ విండో మాజీ చైర్మన్ హరిబాబురెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు పాల్గొన్నారు.

వస్తువు నాణ్యతా ప్రమాణాలు చూడాలి


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్

సూళ్లూరుపేట : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని బ్రహ్మప్రకాష్ హాలులో గురువారం ప్రపంచ నాణ్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్ మాట్లాడుతూ మనం మార్కెట్లో ఏ వస్తువు కొనుగోలు చేయాలనుకున్నా నాణ్యతా ప్రమాణాలు చూడాలన్నారు. హెచ్ఎస్ఎఫ్‌సీ డిప్యూటీ డైరెక్టర్ గీతాకృష్ణ మాట్లాడతూ భారత్ గగన్‌యాన్ క్వాలిటీ స్టాండర్డ్స్‌ను తప్పకుండా పాటిస్తున్నామని తెలిపారు. అందుకే గగన్‌యాన్ ప్రాజెక్ట్‌లో అన్ని పరీక్షలు విజయవంతంగా చేయగలిగామని చెప్పారు. నాణ్యత అనేది పాటిస్తే మన్నిక పెరుగుతుంది. షార్ ఉద్యోగులు, షార్ అధికారులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి వెళ్తూ..!

- కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- తల్లీకూతురు మృతి
- మరో ముగ్గురికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సావిత్రి, సంగీత


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

తిరుపతి రూరల్: ఊరుగాని ఊరు వచ్చి బిడ్డ ప్రయోజకుడు కావడమే కాకుండా సొంతంగా ఇల్లు కట్టుకున్నాడనే ఆనందం ఓ వైపు.. వయస్సు సహకరించకున్నా బిడ్డ ఎదుగుదలను స్వయంగా చూసి సొంత ఇంట్లో అతన్ని ఆశీర్వదించాలనే ఉత్సాహం మరో వైపు.. వెరసి కూతుళ్లు, బంధువులతో కలిసి నిమిషాల వ్యవధిలో గమ్యానికి చేరుకుంటామనగా, బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. కారును బస్సు ఢీకొట్టడంతో తల్లీకూతుళ్లు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా, పుల్లంపేట మండలం, రంగంపల్లికి చెందిన రాజశేఖర్‌రాజు తిరుపతికి వచ్చి బిల్డర్‌గా పనిచేస్తున్నాడు. తిరుపతి రూరల్ మండలం, గాంధీపురం పంచాయతీ, ధనలక్ష్మీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల వేదాంతపురం పంచాయతీ, ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌లో స్థలం కొని సొంతగా ఇంటిని నిర్మించుకున్నాడు. గురువారం గృహప్రవేశం ఉంది. అందుకోసం రంగంపల్లి నుంచి రాజశేఖర్‌రాజు తల్లి సావిత్రి(80), చెల్లెలు సంగీత(39)తో పాటు జ్యోతి, లక్ష్మీదేవి మరో ఇద్దరు కారులో బుధవారం రాత్రే ధనలక్ష్మీనగర్‌కు చేరుకున్నారు. గురువారం తెల్లవారుజామున గృహప్రవేశం కావడంతో అందరూ ధనలక్ష్మీనగర్ నుంచి వేదాంతపురానికి తెల్లవారుజామున 3.30 గంటలకు కారులో బయలుదేరారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి వేదాంతపురం సర్కిల్ వద్ద నల్గొండ నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. ఆ వేగానికి బస్సు కారును కొంతదూరం ఈడ్చుకుని వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సావిత్రి, సంగీత, జ్యోతి, లక్ష్మీదేవి, మరో ఇద్దరిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సావిత్రి, సంగీత మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ సురేష్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. మృతురాలి బంధువు సంజయ్‌రాఘవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన సంగీత భర్త రమేష్ తిరుపతి రూరల్ ఎక్సైజ్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తీవ్రంగా గాయపడిన జ్యోతి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

రాష్ట్రంలో ఆకలి కేకలు

- సీఎం మొదటి సంతకానికే దిక్కులేదు?
- కలెక్టరేట్ వద్ద సీపీఎం నేతల ధర్నా


తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి అర్బన్: రాష్ట్రంలో పేదలు ఆకలి కేకలతో అలమటిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందారపు మురళి మండిపడ్డారు. ఈ మేరకు గురువారం తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకరం సందర్భంగా తొలి సంతకం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించి, ఆయన పెట్టిన సంతకానికి ఐదు నెలలు పూర్తయ్యిందని చెప్పారు.

అయితే ఇప్పటివరకు కనీసం డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని ధ్వజమెత్తారు. గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులను భర్తీ చేయాలని, ఖాళీగా ఉన్న 2.25 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓ వైపు కూరగాయల ధరలు, మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు, ఇంకో వైపు నూనె ధరలు మండుతున్నాయని వాపోయారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడికి ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు పట్టించుకోలేదని గుర్తుచేశారు. విద్యుత్ చార్జీలు ఇష్టారాజ్యంగా పెంచడంతోపాటు స్మార్ట్ మీటర్లు పెట్టి మరింత చార్జీలను పెంచి మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక పేరుతో పెద్ద ఎత్తున కూటమి నేతలు ఇసుక వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. మహిళలు, చిన్న పిల్లలపై అత్యాచారాలు, హత్యలు చేయడం, మహిళలు అదృశ్యం కావడం.. ఈ ఘోరాలు నేరాలు ఏమిటో అర్థం కావడం లేదన్నారు. దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులు చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు భూపంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. సీపీఎం నగర కార్యదర్శి సుబ్రమణ్యం, జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర, డాక్టర్ పీ.సాయిలక్ష్మి, హరినాథ్, వెంకటేష్, సుమన్, ఆర్.లక్ష్మి, వేణుగోపాల్, నరేంద్ర, బుజ్జి, సత్య, ఈశ్వరి, కరిముల్లా, బాలకృష్ణ, రంగయ్య, వెంకటేష్ చిన్న, రాధాకృష్ణ, శీను, రాధా, సెల్వరాజు పాల్గొన్నారు.

తెప్పపై ధన్వంతరిమూర్తి విహారం


ఉభయ నాంచారులతో ధన్వంతరిమూర్తిగా కల్యాణ వెంకన్న


తెప్పపై విహరిస్తున్న ఉత్సవమూర్తులు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ కార్తీక తెప్పోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం పద్మసరస్సులో తెప్పపై శ్రీదేవి, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ధన్వంతరిమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. 9 గంటలకు ఉభయ నాంచారుల సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సమూర్తులకు కల్యాణ మండపంలో ఏకాంతంగా స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను నిర్వహించి అర్చకులు తిరుచ్చి వాహనంపై ధన్వంతరిమూర్తిగా వెంకటేశ్వరస్వామిని అలంకరించి, ఉభయ నాంచారులతో అధిష్టింపజేశారు. సుగంధ పరిమళ పుష్పమాలికలు, స్వర్ణాభరణాలు, పట్టు పీతాంబరాలతో అలంకరించారు. మేళతాళాలు, భక్తుల కోలాటాలతో ఊరేగింపు పద్మసరస్సుకు బయల్దేరింది. పద్మసరస్సుకు చేరుకున్న స్వామివారు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై అధిష్టించారు. వేద, గాత్ర, నాథ కచేరీల మధ్య పద్మసరస్సులో ఐదు ప్రదక్షిణలు తెప్ప విహరించింది . ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం, అనంతరం ఏకాంత సేవ నిర్వహించారు. పైకార్యక్రమాలలో ఆలయ అధికారి నాగరాజు, భరత్, షనాయ్, భద్రతా జమేదార్ మల్లికార్జున పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. తెప్పోత్సవంలో చివరి రోజైన శుక్రవారం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామికి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు.

హోటళ్లపై నిరంతర పర్యవేక్షణ


మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో హోటళ్లపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, నాణ్యమైన ఆహారాన్ని పరిశుభ్రంగా అందించాల్సిన బాధ్యత యజమానులపై ఉందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల నగరంలోని హోటళ్లలో నాణ్యతల లేని ఆహారం అందిస్తున్నారని అనేక ఫిర్యాదులు అందాయన్నారు. మంచి ఆహారాన్ని అందించడంతోపాటు హోటళ్లలోని వంట గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఇకపై ప్రైవేటు హోటళ్లపై నిరంతర నిఘా ఉంటుందని హెచ్చరించారు. క్లీన్ తిరుపతి కోసం రాజీలేని నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో రాత్రి పూట చెత్త సేకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. రోడ్లపై చెత్త పారబోసే వ్యాపార సంస్థలను గుర్తించి భారీ జరిమానా విధించనున్నట్లు తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధిలో భాగంగా స్థలాలు కోల్పోయిన యజమానులకు టీడీఆర్ బాండ్లు త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సచివాలయ ఉద్యోగినికి వేధింపులు

- మూడు నెలల కిందటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు
- వేధింపులకు పాల్పడిన అధికారికి పోస్టింగ్ ఇవ్వని కలెక్టర్

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆయనో జిల్లాస్థాయి అధికారి.. సచివాలయ మహిళా ఉద్యోగినిలే ఆయన టార్గెట్.. గతంలో తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలో అధికారిగా పనిచేసిన ఆయన అప్పటి పరిచయాల దృష్ట్యా ఓ సచివాలయ ఉద్యోగినితో ఆయన తరచూ వాట్సాప్ చాటింగ్ చేసి అభ్యంతరకరమైన మెసేజ్‌లు పంపేవారు. మెసేజ్‌లు శ్రుతి మించడంతో వేధింపులు తాళలేక బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఈ విషయంపై ఆగ్రహించి అతని నుంచి క్షమాపణ లేఖ రాయించుకుని వదిలిపెట్టారు. విషయం ఎక్కడా బయటకు పొక్కకుండా ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచారు. అయితే సాధారణ బదిలీల్లో ఆయనకు జిల్లా కలెక్టర్ ఇప్పటివరకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వనట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయం మండలంలో వేనోళ్ల నానుతోంది. దీంతో తనపై ఫిర్యాదు చేసిన ఉద్యోగినిపై, ఆమెకు సహకరించిన వారిపై కక్ష పెంచుకుని వేధించే పనిలో ఉన్నట్లు సమాచారం. ఎంతో హుందాగా వ్యవహరించాల్సిన ఆయన వంకర బుద్ధిపై మండలంలో పలువురు సచివాలయ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. దీనిపై ఆ అధికారిని వివరణ కోరగా.. తనపై ఎవరూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయలేదన్నారు. అదంతా పచ్చి అబద్ధమని, రేణిగుంట మండలంలో పనిచేస్తున్న ఓ అధికారి వెనుకుండి తనపై విషప్రచారం చేయిస్తున్నారన్నారు. ఎడిటింగ్ మెసేజ్‌లు పెట్టి వాట్సాప్‌లో తాను చేసినట్లు ప్రచారం చేస్తున్నారన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే 108 సేవలు బంద్


మాట్లాడుతున్న 108 కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్

తిరుపతి కల్చరల్: ఆపదల్లో ఉన్న ప్రజల ప్రాణాలు కాపాడేందుకు నిరంతరం శ్రమించే తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ఈనెల 25వ తేదీ నుంచి 108 సేవలు నిలుపుదల చేస్తామని 108 కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తేల్చిచెప్పారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 108 అత్యవసర సేవలు నేడు రాష్ట్రంలో చతికలపడ్డాయన్నారు. 108 ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి పలు దఫాలుగా వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 25వ తేదీ నుంచి 108 సేవలను బంద్ చేస్తామని చెప్పారు. సమావేశంలో 108 కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేష్, కార్యదర్శి మునిరాజా, రాజేష్, సునీల్, కేశవులు, సుధాకర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చంద్రగిరి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శ్రీనివాసమంగాపురం మార్గంలోని బ్రిడ్జి వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగి, నీలం రంగు జీన్స్ ప్యాంటు, తెల్లచారల షర్టు ధరించిన వ్యక్తి గురువారం అతిగా మద్యం సేవించడంతో బ్రిడ్జి సమీపంలో స్పృహ కోల్పోయి పడిపోయాడు. సాయంత్రం అటుగా వెళ్తున్న వారు అతనికి నీళ్లు తాగిపించినట్లు స్థానికులు తెలిపారు. అనంతరం అక్కడ బ్రిడ్జి సమీపంలో మృతి చెంది పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించి మృతుడి ఆచూకీ కోసం పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడు అతిగా మద్యం సేవించడం వల్లే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై మక్కువ ముఖ్యం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ కేవీఎన్ కుమార్

తిరుపతి(అలిపిరి): విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని డీఈఓ కేవీఎన్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో తిరుపతి బాలోత్సవం సహకారంతో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజినీరింగ్-మ్యాథమేటిక్స్ నమూనాలను ప్రదర్శించారు. 'వాతావరణ మార్పులు-పర్యావరణం', 'మానవజాతి గతిని మార్చిన ఆవిష్కరణలు' అనే అంశంపై సుమారు 22 లఘునాటికలు ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా డీఈఓ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్, రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సోము రవికుమార్, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

ఏకోత్తర సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ


పెంచలకోనలో కలశాభిషేకానికి అంకురార్పణ చేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీ నసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం జరగనున్న ఏకోత్తర సహస్ర కలశాభిషేకానికి(10001) గురువారం రాత్రి అంకురార్పణ చేపట్టారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శ్రీవారికి ఏకోత్తర సహస్రకలశాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవస్థానంలోని అలంకార మండపంలో సహస్ర కలశాభిసేకానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు శ్రీవారి నందన వనం నుంచి పుట్టమట్టి తీసుకొచ్చి అందులో నవధాన్యాలు పోసి ప్రత్యేక పూజలు, హోమాలు, పుణ్యాహవచనం నిర్వహిచారు. ఉదయం 9గంటలకు ఉత్సవ విగ్రహాలకు 1001 కలశాలల్లో ఉంచిన నదీజలాలు, సముద్ర జలాలు, బావి జలాలు, చేరుకు రసం, అడవి వృక్షల కషాయంతో అభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్ర 6 గంటలకు ఉత్సవర్లు తిర్చుపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

పీజీ, రీసెట్ పరీక్షలు వర్సిటీనే నిర్వహించాలి


వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

తిరుపతి సిటీ: పీజీ, రీసెట్ ప్రవేశ పరీక్షలు ఎస్వీయూ పరిధిలోనే నిర్వహించేలా ఉన్నత విద్యా మండలి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షులు శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రిజిస్ట్రార్ భూపతినాయుడును కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో పీజీ సెట్, రీసెట్ సంబంధించి ప్రవేశ పరీక్షలు వర్సిటీ ఆధ్వర్యంలో జరిగేవని, దీంతో వర్సిటీలోని ప్రతి విభాగంలో పీజీ కోర్సుల్లో సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యేవన్నారు. కానీ స్టేట్ లెవల్‌లో ఏపీ పీజీ సెట్ నిర్వహించడంతో వర్సిటీలో కొన్ని పీజీ కోర్సుల్లో సింగిల్ డిజిట్ అడ్మిషన్లకే పరిమితం కావడం దారుణమన్నారు. రాయలసీమ, ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులకు వర్సిటీలో ప్రవేశాలు సులభతరంగానూ, అనుకూలంగానూ ఉండేవన్నారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష రీసెట్ సైతం వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించి వర్సిటీ ప్రతిష్టను పెంచేందుకు అధికారులు చొరవచూపాలని కోరారు. వర్సిటీ ఉపాధ్యక్షులు మణికంఠ, ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.